# లంకె బిందెలు

గబ్బిట కృష్ణమోహన్



మూలం
ఫ్రోజెన్ ఎసెట్స
పి.జి.ఉడ్‌హౌస్

# లంకెబిందెలు

## గబ్బిట కృష్ణమోహన్

---

మూలం

ఫ్రోజెన్ ఎసెట్స్ - పి.జి.వుడ్‌హౌస్

**టష్షన్ పబ్లికేషన్స్**

హైదరాబాద్

**FROZEN ASSETS : PG WODEHOUSE**
© The Estate of PG Wodehouse

**లంకెబిందెలు**

గబ్బిట కృష్ణమోహన్

ముద్రణ

**జనవరి, 2014**

మూల్యం : **రూ 150/-**

Reproduced by permission of the Estate
c/o Rogers, Coleridge & White Ltd.,
20 Powis Mews, London W11 1JN

ముఖచిత్రం

**కళాప్రపూర్ణ డాక్టర్ బాపు**

**లంకెబిందెలు** తెలుగు రచన హక్కులు

**G. KRISHNA MOHAN**
105, Srinilaya Sagar View
6-3-1099/1/9 Somajiguda
Hyderabad 500 082
Phone : 66105247, Mobile 9391015247
e-mail : mohangabbita@gmail.com

ప్రింటర్స్

**హైటెక్ ప్రింటర్స్,**
హైదరాబాద్. ఫోన్9966884513

ప్రచురణ:

**టష్షన్ పబ్లికేషన్స్**, హైదరాబాద్

Sole Distributors :
**NAVODAYA BOOK HOUSE**
3-3-865, Opposite Arya Samaj Mandir
Kachiguda 'X' Roads,
Hyderabad - 500 027
Phone : 040-24652387

# ముందుమాట

అనువాదాలు చేయడానికి చాలా నైపుణ్యం కావాలి. అంతకంటె ఎక్కువ గుండెధైర్యం కావాలి. ఈ అనువాద ప్రక్రియలో అంతో యింతో తల దూర్చి వున్నవాడిని కనక అనువాదం అనేది చాలా కష్టమూ, చీకాకుతో గూర్చిన వ్యవహారమని నేను స్వానుభవంతో చెప్పగలను. ఏ అనువాదంలోనైనా అనువాదకుడు ఓపక్క మూలరచనకు న్యాయం చేస్తూ మరోపక్క ఏ భాషలోకి అనువాదం చేస్తున్నామో ఆ భాషా సంస్కృతిక సంప్రదాయాలకు అనువైన నుడికారాలతో, పఠనయోగ్యంగా అనువాదం సాగించాలి. ఈ సమతూకం సాధిచటం తేలిక కాదు. అందులోనూ పి.జి. వుడ్‌హౌస్ లాంటి హాస్య రచయితల రచనలు తెలుగులోకి అనువదించటం – అదీ, ఎంతో ముచ్చటగా అనువదించటం – తలపెడితే, దాన్లో ఎదురయ్యే సమస్యలు అన్నీ యిన్నీ కావు. అయినా శ్రీ గబ్బిట కృష్ణమోహన్ ఈ క్లిష్టమైన కార్యాన్ని అలవోకగా – ఒకసారి కాదు, మళ్ళీ మళ్ళీ కూడా – విజయవంతంగా నిర్వహించి చూపుతున్నారు.

ఇంతకుముందు వుడ్‌హౌస్ రాసిన 'ది ఓల్డ్ రిలయబుల్' నవలను 'ఆపద్బాంధవి ఉరఫ్ పాపాలభైరవి' పేరుతోనూ, ఆయనే రాసిన పది 'మల్లినర్' కథలను 'సరదాగా కాసేపు' పేరుతోనూ, 'అంకుల్ డైనమైట్' నవలను అదే పేరుతోనూ అనువదించిన శ్రీ కృష్ణమోహన్ యిప్పుడు వుడ్‌హౌస్ రాసిన మరో నవల 'ఫ్రోజెన్ ఎసెట్స్' మీదికి దండెత్తేసి, దాన్ని 'లంకెబిందెలు' గా అనువదించారు. 'ఫ్రోజెన్ ఎసెట్స్' నవల బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచ్ జాతీయుల భేషజాలనూ, బలహీనతలునూ విలక్షణంగా చిత్రీకరిస్తుంది. నవలలో వున్న అనేకమైన పెద్దా, చిన్నా పాత్రలన్నీ రచయిత శ్రద్ధగా చెక్కినవే. వుడ్‌హౌస్ రచనలు చిత్రమైన హాస్యస్ఫోరకమైన అర్థాలంకారాలకు, ముఖ్యంగా చిత్రవిచిత్రమైన రూపకాలంకారాలకూ జగత్ప్రసిద్ధం. అలాంటి అలంకారాలను ఈ నవలలో కూడా వుడ్‌హౌస్ పుష్కలంగా దట్టించాడు. అలాంటి నవలను పరభాషలోకి అనువదించటం నిజంగా ఒక సాహసమే. మూలంలో బ్రిటిష్, ఫ్రెంచి జాతీయుల మధ్య జరిగిన సన్నివేశాలను తెలుగు–మరాఠీ భాషీయుల మధ్య సన్నివేశాలుగా చిత్రించి శ్రీ కృష్ణమోహన్

మూలంలో కనిపించే చమత్కారాన్ని ప్రభావవంతంగా తెలుగులోకి తెచ్చారు. మూలంలో (వేపకాయంత వెర్రి వున్న) ఫ్రెంచి పోలీసుల వాడుక పదాలు మన మరాఠీ మానుస్‌లు వాడే 'కాయ్ సాయెబ్', 'బరోబర్' లాంటి మాటలుగా రూపాంతరం చెందాయి. మూలంలో 'పెర్సీ పిల్‌బీమ్' తెలుగులో పిల్లి పుల్లారావు అయ్యాడు. 'సొసైటీ స్పైస్' పత్రికకు తెలుగులో 'సమాజ సుగంధాలు' అని నామకరణం చేశారు. మూలంలో హొరేస్ కవి గురించిన ప్రస్తావనలుంటే, దాని బదులు తెలుగులో సుమతీ శతకకారుడు బద్దెనని తీసుకురావటం చక్కగా అమరింది. అయితే హొరేస్ లాటిన్ కవి కనక, ఆయన స్థానంలో భర్తృహరిని వుంచి, భర్తృహరి సుభాషితాలు వుటంకిస్తే యింకా ఔచిత్యం వుండేదా అని ఒక వూహ.

మూలంలో 'లార్డ్ టిల్బరీ' వస్త్రాపహరణ ఘట్టంలో తటస్థపడే 'టౌజర్ (కుక్క) – ట్రౌజర్' గందరగోళాన్ని తెలుగులో 'నాగూ–లాగూ' భాగోతంగా భాషాంతరీకరించారు. మూలంలో 'బంటింగ్, శాటర్త్‌వైట్ అండ్ మైల్స్'లో కనిపించే లాయర్ బంటింగ్, తెలుగు అనువాదంలో 'కాంతయ్య అండ్ గరుడాచలం, సొలిసిటర్స్' సంస్థలో భాగస్వామి తరకటూరి కాంతయ్యగా అవతరిస్తాడు. దాంతో మూలంలో బంటింగ్‌ను నిరంతరం వేధించే వుదరకోశ సమస్యలు పాపం కాంతయ్యగారికి కూడా సంక్రమించాయి. ఇలాగ, మూలంలో వున్న చిన్న చిన్న పాత్రలను కూడా తెలుగులో ఎంతో శ్రద్ధతో, ఓపికతో తీర్చిదిద్దటం వల్లనే, వుడ్‌హౌస్ తన పాత్రల సృష్టిలో యిమడ్చే హాస్య సౌరభాన్ని యీ అనువాదం పూర్తిగా అందిపుచ్చుకుంది. అందుకే కదా మరి, శ్రీ కృష్ణమోహన్ వుడ్‌హౌస్ అనువాదాలు కీర్తిశేషులు ముళ్ళపూడి వెంకట రమణ గారి వంటి వుడ్‌హౌస్ ప్రియులకు అంతగా ప్రీతిపాత్రమై ప్రశంసలందు కున్నాయి!

నేను 'ఫ్రోజెన్ ఎసెట్స్' నవల ఎన్నోసార్లు చదివి ఆనందించాను. అది నాకు ఎంతో నచ్చిన నవల. ఇప్పుడు కృష్ణమోహన్‌గారి యీ అనువాదం నాకు మళ్ళీ అంతగానూ నచ్చింది. ఇంతకంటే ఏం చెప్పను?

డిసెంబర్–2013
హైదరాబాదు

**బుర్రా సూర్యప్రకాష్**

# నవ్వులా అవి ? కావు, నవపారిజాతాలు
# రవ్వంత సడిలేని రసరమ్య గీతాలు

పి.జి. వుడ్‌హౌస్ రచనల్లో అడుగడుగునా జాలువారే సున్నితమైన హాస్యం, చతురోక్తులుతో మనసు గిలిగింతలైన పాఠకుల దరహాసాలు నవపారిజాతాల లాంటివి. ఎన్నిమార్లు చదివినా పరిమళం గుబాళిస్తూనే వుంటుంది. మనసు బాలేనప్పుడు వుడ్‌హౌస్ రచనలు చదివితే వుల్లాసం, బాగున్నప్పుడు చదివితే వుత్తేజం కలుగుతుందని సిఫార్సు చేశారొకాయన. మొజార్ట్ సంగీతపు భావన కలిగిస్తూ పదబంధంలో, శైలిలో కనబడే పరిపూర్ణత – శ్రావ్యమైన సంగీతం; అంత చక్కటి సంగీతం యితర ఆంగ్ల రచయితలు సాధించలేదని కొనియాడాడు సైమన్ కేలో. అందుకే అవి రసరమ్య గీతాలు. తన రచనలు సంగీతం లేని సంగీత రూప కాలు (మ్యూజికల్ కామెడీ వితౌట్ మ్యూజిక్) అని వుడ్‌హౌస్ చెప్పుకున్నాడు. భాషనే కాక బైబిల్ సూక్తులు, షేక్స్పియర్, టెనిసన్ రచనలనించి కొటేషన్లు కూడా కథకి అనుకూలంగా, అనుగుణంగా మలుచుకుని హాస్యం సృష్టించిన అక్షరశిల్పి వుడ్‌హౌస్. పేజిలో కనీసం మూడయినా తనకే స్వంతమైన బాణీలో విలక్షణమైన వుపమానాలు దొరుకుతాయన్నాడు మరో హాస్యరచయిత ఎవిలిన్ వా. ఉపమ, రూపకాలంకారాలు సమృద్ధిగా వాడటంతో పాటు మిక్స్‌డ్ మెటఫర్ (తెలుగులో దీన్ని రూపకాభాస అనవచ్చని తెలుగు విద్వాంసులొకరు చెప్పారు) కూడా విరివిగా వాడి నవ్వులు పూయించాడు. అతిశయోక్తులు కోకొల్లలు. ''సంఘటన ఎంత గంభీరమైనదైనా, ఎంత భయంకరమైనదైనా, ఎంత విషాదకరమైనదైనా మనకి ఆయన కలిగించే అనుభవం హాస్యమే'' అన్నారు పాలగుమ్మి పద్మరాజు. ముళ్ళపూడి వెంకట రమణ ఆయన్ని హాస్యరస రాజాధిరాజు అని శ్లాఘించడంలో అతిశయోక్తి లేదు.

### వుడ్‌హౌస్ ప్రపంచం, అందులోని పాత్రలు

తన రచనల్లో సృష్టించిన లోకం కాల్పనికం కాదు, రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలం (1920 దశకం) లోదని ఒక ఇంటర్వ్యూలో వుడ్‌హౌస్ చెప్పాడు.

లార్డ్, ఎర్ల్ వగైరా ప్రభువర్గీయులు (నోబుల్ మెన్) క్షీణించిన ఆదాయంతో వారసత్వపు ప్రాసాదాలని (క్యాజిల్స్‌ని) సంరక్షించుకోలేక యిక్కట్లు పడుతుంటారు; డబ్బు వున్నా బుర్ర తక్కువ మూలాన చిక్కుల్లో యిరుక్కుంటే బట్లర్ జీవ్స్ తన బుద్ధికుశలతతో గట్టున పడేస్తాడు. జిల్లా ప్రదర్శనలో పోటీగా ముందు అతిపెద్ద గుమ్మడికాయని పండించి, ఆ తరవాత మహా లావుపాటి పందిని పెంచుతూ దానికి ముచ్చటగా 'ఎంప్రెస్ ఆఫ్ బ్లాండింగ్స్' అని పేరు పెట్టి, పోటీలో గెలిపించడమే లక్ష్యంగా పెట్టుకున్న మతిమరుపు బ్లాండిగ్స్ క్యాజిల్ యజమాని లార్డ్ ఎమ్స్‌వర్త్, జీవ్స్‌తోపాటు చిరస్మరణీయుడైనాడు. రచయిత తను సృష్టించిన పాత్రల ద్వారా కీర్తి పొందుతాడంటూ – షెర్లాక్‌హోమ్స్, టామ్‌సాయర్, రాబిన్‌సన్ క్రూసోలని వుదహరిస్తూ, కొంతకాలానికి పి.జి. వుడ్‌హౌస్ మరుగునపడ్డా ఆయన పాత్రలు – ముఖ్యంగా జీవ్స్ ఆంగ్లభాషలో శాశ్వత స్థానం పొందాయన్నాడు ఎలరీ క్వీన్. జీవ్స్ పాత్రని ఎలా వూహించారని అడిగితే, ''మొదటి కథలో బట్లర్ జీవ్స్ నోరు విప్పింది కేవలం రెండుసార్లే. ఆ తరవాత బెర్టీ వూస్టర్, మిత్రుడు కార్కీ కష్టాల్లో యిరుక్కున్నప్పుడు బయటపడే తెలివితేటలు ఆ యిద్దరిలో లేనందుకు అందులో ఒక పాత్రకి సామర్థ్యమున్న బట్లరు వుంటే బాగుంటుందని తోచి జీవ్స్‌ని వినియోగించాను. క్రమేణా ఆ పాత్ర చివరకి తొమ్మిది నవలల్లో, ముప్ఫయికి పైగా చిన్నకథల్లో అభివృద్ధి చెందింది'' అని వుడ్‌హౌస్ ఉవాచ. ఆయన రచనల్లో కుర్రాళ్ళంతా అల్లరివాళ్ళు, బ్రహ్మచార్లు; యువతులంతా కొనముక్కు పైకి తేలిన రూపవతులు, కోరస్ గర్ల్స్, బార్ మెయిడ్స్; వయసు మళ్ళినవారు కూడా వయసులో వున్నప్పుడు ఆకతాయి పనులు చేసిన వాళ్ళే; పెర్సీ పిల్‌బీమ్, చింప్ ట్విస్ట్, సోపీ మొలాయ్ వంటి టక్కరుల సన్నివేశాల్లో సైతం హాస్యం సృష్టించినందుకు ఆ పాత్రలు కూడా పాఠకులని రంజింపచేస్తాయి. ఆ రచనల్లో కనబడనివల్లా – శృంగారం, మరణం, క్రూరత్వం. చెక్కిలి మీద ముద్దు తప్ప ఘాటు శృంగారం వాడాలనిపించలేదా అని అడిగిందానికి, ''నా రచనలు దానికి సమ్మతించవు, శృంగారం కూడా వినోదమే అయినా దాన్ని సజావుగా నిర్వహించాలి, అది నాకు చేతకాదు'' అన్నాడు. మీ రచనల్ని మళ్ళీ ఎప్పుడైనా చదువుతారా అంటే, ''ఓ, చదివి బాగున్నాయిగా అనుకుంటా'' అన్నాడు.

93 సంవత్సరాల పరిపూర్ణ జీవనయానంలో వెరసి 92 నవలలు, కథా సంపుటాలు; 400 పైగా వ్యాసాలు రాశాడు. వాటిల్లో ఏదీ సీరియస్ కాదు. అన్నీ హాస్య ప్రహసనాలు, ఫార్స్. ఇవికాక 30కి పైగా సంగీత రూపకాలకి

సహరచయిత, గీత రచయిత. ఆ జీవితాన్ని సహరచయిత గై బోల్టన్‌తో కలిసి 'బ్రింగ్ ఆన్ ది గర్ల్స్ – ది ఇంపాజిబుల్ స్టోరీ ఆఫ్ అవర్ లైఫ్ ఇన్ మ్యూజికల్ కామెడి' పేరుతో రాశాడు. బాల్యమిత్రుడు డబ్ల్యు. టౌనెండ్ తనకి వుడ్‌హౌస్ రాసిన వుత్తరాల పరంపరని 'పెర్ఫార్మింగ్ ఫ్లీ – ఎ సెల్ఫ్ పోర్ట్రైట్ ఇన్ లెటర్స్' పేరుతో ప్రచురించాడు. 'ఓవర్ సెవెన్టీ – యాన్ ఆటోబయాగ్రఫీ విత్ డిగ్రెషన్స్' లో తన సుదీర్ఘ రచనా వ్యాసంగం గురించి తక్కువగా, పేరుకు తగ్గట్టు డిగ్రెషన్స్ – అసందర్భపు కబుర్లు ఎక్కువగా వివరించాడు. పై మూడింటిలో వుడ్‌హౌస్ జీవితం గురించి కొంత సమాచారం, ఆయన యిచ్చిన ఇంటర్వ్యూల్లో మరికొంత సమాచారం లభ్యమవుతుంది.

**బాల్యం, చదువు**

పెల్హామ్ గ్రెన్విల్ వుడ్‌హౌస్ ఇంగ్లాండులో 1881 (ఈ అంకె తెలుగుపదం – వికటకవి గుర్తుకు తెస్తుంది) సంవత్సరం, అక్టోబర్ 15న జన్మించాడు. ఆప్తులకు ఆయన 'ప్లమ్'. హాంకాంగ్‌లో తండ్రికి హాంకాంగ్ అండ్ షాంగై (ఇప్పటి హెచ్.ఎస్.బి.సి) బ్యాంకులో వుద్యోగం. వుడ్‌హౌస్ బాల్యం, స్కూలు చదువులు లండన్‌లో బంధువుల యిళ్ళల్లోనే గడిచాయి. అందుకేనేమో ఆయన రచనల్లో తల్లిదండ్రులకన్నా అంకుల్స్, ఆంట్స్ ఎక్కువగా తారసపడతారు. చిన్నప్పటినుంచే రచయిత కావాలని బలీయమైన కోర్కె వుండేదంటూ, ''మొదటి కథ రాసినప్పుడు నాకు ఐదేళ్ళు. అంతకుముందు ఏం చేసేవాడినో గుర్తులేదు. బహుశ బదుద్ధాయిలా తిరిగేవాణ్ణనుకుంటా'' అని చెప్పుకున్నాడు. స్కూల్లో బాక్సింగ్, రగ్బీ, క్రికెట్ ఆడేవాడు. ఫాస్ట్ బౌలర్, పదో నెంబరు బ్యాట్స్‌మన్. అభిమానులు, వుడ్‌హౌస్ స్కాలర్లు డల్విచ్ కాలేజిలో అప్పటి క్రికెట్ స్కోర్ కార్డులు పోగుచేసి పాఠకులకి అందించారు. స్కూలు చదువు పూర్తికాగానే ఆక్స్‌ఫర్డ్‌లో అభ్యసించాలని తయారవుతున్న సమయంలో తండ్రి రిటైరయి లండన్లో స్థిరపడ్డాడు. పెన్షను రూపాయల్లో వస్తుండటంతో ఆదాయం తగ్గింది. పెద్దకొడుకు కూడా చదువుతున్నందుకు ఆక్స్‌ఫర్డ్ చదువు భరించడం కష్టమని 1900లో తండ్రి, అతన్ని లండన్‌లోని హాంకాంగ్ అండ్ షాంగై బ్యాంకులో చేర్పించాడు. లెక్కలు, లెడ్జర్ల వుద్యోగం యిబ్బందిగా అనిపించింది. అప్పటికే రాయడం మొదలెట్టాడు. గ్లోబ్ మేగజిన్లో పనిచేస్తున్న మిత్రుడు మూడువారాలపాటు సెలవులో వెడితే లెడ్జర్లు మోసీ మోసీ చెయ్యి నొప్పి పుడుతోందన్న సాకుతో బ్యాంకు వుద్యోగానికి సెలవు పెట్టి తాత్కాలికంగా అతని స్థానం భర్తీ చేశాడు. రెండేళ్ళపాటు బ్యాంకులో పనిచేసి,

''బొంబాయిలాంటి ప్రాచ్య ప్రదేశాల్లో బ్యాంకు మేనేజరుగా బదిలీ చేసి జీతం రూపాయల్లో యిస్తారుగా'' అని భయపడుతున్న సమయంలో గ్లోబ్ పత్రిక వారానికి మూడు పౌండ్ల జీతానికి పూర్తికాలపు వుద్యోగిగా అయిదు వారాలపాటు 'బై–ది–వే' కాలమ్ నడపమంటే ఆనందంగా వెంటనే చేరాడు. మొదటి కథ యిరవయ్యొకటవ యేట అమ్మి అప్పటినుంచి పూర్తికాలపు రచయితగా స్థిరపడ్డాడు. అమెరికా వెళ్ళాలనే యిచ్ఛ తీవ్రంగా వుండి, గ్లోబ్ పత్రికా వ్యాసంగంలో సెలవు దొరగ్గానే 1904లో మూడువారాలపాటు అమెరికా పర్యటించాడు. ''అమెరికా వెళ్ళొచ్చినందుకు లండన్‌లో నా ప్రతిష్ట యినుమడించింది.'' 1909లో మరోసారి అమెరికాకి వెళ్ళి గ్రీన్‌విచ్‌లో కొంతకాలం గడిపి తిరిగి వెళ్ళే సమయంలో, ''కాస్మాపాలిటన్, కోలియర్స్ పత్రికలకి రెండు కథలు అమ్మగా రెండింటికీ కలిపి 500 డాలర్లొచ్చాయి, ముందు సంపాదించిన దానికన్నా యిది చాలా ఎక్కువ మొత్తం. అందుకే గ్లోబ్ కి రాజీనామా చేసి అక్కడే వుండిపోయా. అయినా తరవాత డబ్బుకి ఎప్పుడూ యిబ్బందే. వ్యానిటీ ఫెయిర్ సంపాదకుడు ఫ్రాంక్ క్రౌనిన్‌ఫీల్డ్ కనక నేను రాసినవన్నీ తీసుకోకపోయుంటే నా పరిస్థితి దుర్భరమై వుండేది'' అని చెప్పాడొక ఇంటర్వ్యూలో.

**వివాహం, తొలి నవల**

''మానవరూపంలో వున్న దేవత'' ఎథెల్‌ని కలిసి సెప్టెంబర్ 1914లో వివాహం చేసుకున్నాడు. ఆ దంపతుల వివాహబంధం అవిచ్ఛిన్నంగా 61 సంవత్సరాలపాటు సాగటం వారి అన్యోన్యానురాగాలకు ప్రతీక. ఆమె వితంతువు. మొదటి భర్తతో కలిగిన కుమార్తె లియోనారాకి అప్పటికి పదేళ్ళు. వుడ్‌హౌస్ ఆ పిల్లని అపురూపంగా చూసుకునేవాడు. వారిద్దరికీ ఒకరిపట్ల మరొకరికి అభిమానం, ఆత్మీయత. ''పెళ్ళప్పుడు నా దగ్గర 75, ఎథెల్ దగ్గర 50 డాలర్లు వున్నాయి. మరికొంత సంపాదించి నెలకో నూరు డాలర్లన్నా వెనకేసుకోవాలనుకున్నాం. 1916లో నా మొదటి నవల సంథింగ్ ఫ్రెష్‌ని శాటర్‌డే ఈవినింగ్ పోస్ట్ పత్రిక 3500 డాలర్లకు కొని ధారావాహికంగా ప్రచురించింది. ప్రపంచంలో ఏమూలో అంత డబ్బు వుంటుందని తెలుసు కానీ అది నా పరం అవుతుందనుకోలేదు'' అని చాలాకాలం తరవాత అదే నవలకి ముందుమాటలో రాశాడు. వుడ్‌హౌస్ తిరిగి చూడలేదింక. తరవాత రాసిన ''అనీజీ మనీ, పిక్కడిల్లీ జిమ్, ఎ డేమ్సెల్ ఇన్ డిస్ట్రెస్ లతో సంపాదన పెరిగింది. వాటి పారితోషికం 5000, 7500, 10000 డాలర్ల చొప్పున పెంచుతూ పోయారు.''

## హాలీవుడ్‌లో వుడ్‌హౌస్

అమెరికా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పుడు వుడ్‌హౌస్ కూడా నష్టపోయాడు. దానికి తోడు వీడని ఇన్‌కం ట్యాక్సు గొడవల మూలాన రాబడి పెంచుకోవాలని చూశాడు. అంత సంక్షోభంలోనూ సంపాదన యిబ్బడి ముబ్బడి అవుతుందనుకోలేదు. 1929లో హాలీవుడ్ నుంచి ఎం.జి.ఎం. సంస్థ వారానికి రెండువేల డాలర్లతో ఆరు నెలల పాటు, మరో ఆరు నెలలు పొడిగించే వీలు, వున్న ఆఫరిస్తే వొప్పుకున్నాడు. పని ఎక్కువ లేదు. ఏడెనిమంది రచయితల్తో కలిసి చేసే కథాచర్చలు అస్తమానం మారుతూ పోతుండేవట. ఆ పని నచ్చలేదు. అక్కడ రచయితల్నిఎలా చూస్తారు, డబ్బెంత యిస్తారనేది ఒక ఇంటర్వ్యూలో ప్రస్తావిస్తూ, ''వూర్కే తిరుగుతూ పొద్దు పుచ్చినందుకు నా సంపాదన ఒక లక్షా నాలుగు వేల డాలర్లు. స్టుడియోల్ని మోసం చేసినట్టనిపించింది నాకు'' అని చెప్పినది దేశమంతా పాకి వృధా ఖర్చులు తగ్గించమని బ్యాంకులు స్టుడియోల్ని ఆదేశించాయి. అక్కడ గడిపిన 52 వారాల్లో ఖాళీగా కూర్చోక, ''ఒక నవల, తొమ్మిది చిన్నకథలు రాసి, నా గోల్ఫ్ ఆటని కూడా మెరుగుపరుచుకున్నాను'' అని స్నేహితుడికి రాశాడు.

వుడ్‌హౌస్ దంపతులు 1931లో ఫ్రాన్సుకి మకాం మార్చి ఇంగ్లాడులో చదువుతున్న కూతురు లియొనారాని తరచుగా కలుస్తుండేవారు. 1932లో ఆమె వివాహం ఇంగ్లాండులోనే జరిపారు. 1934లో మళ్ళీ పేరమౌంట్ స్టుడియో నుంచి పిలుపొచ్చినా ట్యాక్సు గొడవల మూలాన తిరస్కరించాడు. మనుమడు, మనుమరాలిని చూడటానికి ఇంగ్లాడుకి వస్తూ పోతూ వుండేవారు. పాతవన్నీ మర్చిపోయి మరోసారి హాలీవుడ్ నుంచి ఎం.జి.ఎం వారి పిలుపుతో 1936లో ఆరు నెలలు గడిపి వచ్చాడు. యూరప్‌లో రెండవ ప్రపంచ యుద్ధపు ఛాయలు కమ్ముకున్నాయి. వుడ్‌హౌస్ బయటి ప్రపంచంతో, రాజకీయాలతో సంబంధం పెట్టుకోకుండా తన మానాన తను ఫ్రాన్సులో రచనా వ్యాసంగం కొనసాగిస్తూనే వున్నాడు. చాలామంది ఇంగ్లీషువాళ్ళు ఫ్రాన్సు దేశం వదిలిపెట్టి వెళ్ళినా ఆ దంపతులు కూతురుకి దగ్గిరగా అక్కడే వుండిపోయారు. 1939లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వుడ్‌హౌస్‌ని గౌరవ డాక్టరేట్ బిరుదుతో సత్కరించినందుకు అక్కడ చదవ లేకపోయిన నిరాశ మీద ఆయనకి విజయం సాధించనట్టయింది.

## రెండవ ప్రపంచ యుద్ధం

1940లో ఫ్రాన్సు దేశాన్ని జర్మనీ ఆక్రమించుకుంది. ఆ దేశంలో వుంటున్న ఆంగ్లేయులతో ప్రమాదమని, నాజీలు, 60 సంవత్సరాలు మించని మగవాళ్ళందర్నీ, వుడ్‌హౌస్‌తోపాటు, నిర్బంధించి వేరువేరు దేశాల శిబిరాల్లో వుంచారు. సైనికులిచ్చిన పది నిమిషాల వ్యవధిలో కాసిని తెల్ల కాగితాలు, పెన్సిళ్ళు, రెండు పైజమాలు, షేక్స్పియర్ రచనలన్నీ వెంట తీసుకెళ్ళాడని తరవాత భార్య చెప్పింది. సహచర ఖైదీలతో చమత్కారాలు చేస్తూ, చెణుకులు విసుర్తూ రచనా వ్యాసంగం మాత్రం వీడలేదు. ఒకసారి అప్పర్ సిలీసియా(యిప్పటి పోలెండ్)లో పాడుబడ్డ ప్రదేశంలో ఖైదీల మకాం పెట్టించినప్పుడు అక్కడి దుర్భర పరిస్థితి చూసి, ''అప్పర్ సిలీసియానే యిలా వుంటే మరి లోయర్ సిలీసియా గతేమిటి?'' అని చమత్కరించాడు. అలా పదకొండు మాసాలు గడిపిన పిమ్మట 60 ఏళ్ళు నిండటానికి కొన్ని నెలల ముందు నిర్బంధం నుంచి విడుదల చేసి ఆయనను బెర్లిన్‌కు తరలించారు. విడుదల వార్త వచ్చిన సమయంలో తోటి ఖైదీలతో వుడ్‌హౌస్ క్రికెట్ ఆడుతున్నాడట. భార్య ఎథెల్ తరవాత బెర్లిన్ చేరుకుంది.

అప్పటికి అమెరికా యింకా యుద్ధంలో చేరలేదు. ఖైదీగా గడిపిన రోజుల గురించి రేడియోలో ప్రసంగాలు చేయమని జర్మన్లు కోరితే అమాయకత్వంతో వొప్పుకుని వారి ప్రాపగాండాకి బలయ్యాడు. చేసింది కేవలం ఒక్కొక్కటి పదమూడు నిమిషాలపాటు ఐదు ప్రసంగాలే, అన్నీ వినోదభరితమే. అయినా బ్రిటన్ దేశద్రోహి అన్న ముద్ర వేసింది. కొన్ని లైబ్రరీల నుంచి ఆయన రచనలు బహిష్కరణకు గురైనాయి. రచయితలు ఎవిలిన్ వా, జార్జ్ ఆర్వెల్‌లు వుడ్‌హౌస్ పక్షాన పోరాడారు. తప్పు చేసినట్టు వుడ్‌హౌస్ చాలా ఆలస్యంగా గుర్తించాడు. యుద్ధం ముగిసిన పిమ్మట జరిపిన విచారణలో వుడ్‌హౌస్ నిర్దోషని తేలినా మళ్ళీ ఇంగ్లాండు గడ్డ మీద కాలు పెట్టలేదు. 1944లో కూతురు లియోనారా మరణవార్త ఆలస్యంగా చేరినప్పుడు ఒకే ఒక వాక్యంలో, ''ఐ థాట్ లియోనారా వజ్ ఇమ్మోర్టల్'' అని స్నేహితుడికి రాశాడట. ప్రతికూల పరిస్థితుల్లోనూ రాయడం మానలేదు. ఆ తరవాత దంపతులిద్దరు అమెరికాకి తిరిగొచ్చి న్యూయార్క్‌లోని లాంగ్ ఐలండ్‌లో వున్న గ్రామం రెమ్సెన్‌బర్గ్‌లో స్థిరపడ్డారు. 1955లో అమెరికా పౌరసత్వం తీసు కున్నాడు.

92వ యేట రాసిన బేచిలర్స్ ఎనానిమస్ నవల తనకి చాలా నచ్చినట్టు ఒక ఇంటర్వ్యూలో చెబుతూ, అదృష్టం కొద్దీ తన రచనల గురించి మంచి విమర్శలే

వచ్చినందుకు సంతృప్తిగా వుందన్నాడు. వుడ్‌హౌస్ ఒక ప్రిఫేస్‌లో రాసిన దాన్ని వుల్లేఖిస్తూ ఆయన అభిమాని శ్రీ బాపు, ''ఒక క్రిటిక్కు – పోయిన నవల్లో నా పాత కేరెక్టర్లనే కొత్త పేర్లతో వాడానని విమర్శించాడు. ఈ కొత్తనవల్లో విత్ మై సుపీరియర్ ఇంటెలిజెన్స్ నా పాత కేరెక్టర్లని పాత పేర్లతోనే వాడాను వ్వేవ్వేవ్వే ...'' అని కార్టూన్‌లా తెనిగించారు. ఇంత వయసులో కూడా వుల్లాసంగా, వుత్సాహంగా ఎలా వుండగలుగుతున్నారన్న ప్రశ్నకి చిన్నా చితక విషయాల్ని పట్టించుకోను, దేనిగురించీ బాధపడను అన్నాడు. నవల రాయడానికి ఎంత సమయం పడుతుందన్న ప్రశ్నకి, ముందుగా ప్లాటు వూహించుకుని నాలుగు వందల పేజీల నోట్సు తయారు చేసుకుంటా. మిగిలిందల్లా వివరాలు నింపడమే. మూడు నెలలకొక నవల పూర్తవుతుంది. టైపు చెయ్యడమే అలవాటు, ఈమధ్యనెందుకో అది స్పేస్ జంపు చేస్తోందన్నాడు – యాభై యేళ్ళకి పైగా అదే టైప్ మిషన్ వాడుతూ. ఆయన రచనల్లో ఆధునిక వుపకరణాలు – టెలిఫోన్, స్టీమింజను రైలు, ఎలివేటర్ లాంటివి తప్ప మరేవీ కనిపించవు. ఒక నవల్లో టి.వి; చివరి సంపూర్తి నవల(బేచిలర్స్ ఎనానిమస్, 1973)లో విమానాశ్రయంలో వీడ్కోలివ్వడంలో మాత్రం మరి కొంత ఆధునికత కనబడుతుంది. అన్నట్టు, 92వ యేట వుడ్‌హౌస్‌ని ఇంటర్వ్యూ చేసిన జెరాల్డ్ క్లార్క్ ప్రకారం టి.వి.లో వస్తుండే సోప్ ఒపేరా 'ది ఎడ్జ్ ఆఫ్ ది నైట్' చాలా యిష్టంగా చూసేవాడట. మునుపొకసారి యింటికెళ్ళినప్పుడు, ''రండి, ఎంచక్కా యిద్దరం కలిసి కూచుని ది ఎడ్జ్ ఆఫ్ ది నైట్ చూడటం సంతోషంగా వుంది'' అన్నాడట. క్వచిత్తుగా బయటకి వెడితే ఆరోజున వచ్చే ఎపిసోడ్ చూసి తనకోసం వివరాలు రాసి పెట్టమని భార్య ఎథెల్‌కి పురమాయించే వాడట.

సమకాలీన రచయితలు సర్ ఆర్థర్ కానన్ డోయెల్ (షెర్లాక్ హోమ్స్ సృష్టికర్త), అగాథా క్రిస్టీ రచనలు విపరీతంగా చదివేవాడు. సోమర్సెట్ మామ్ రచనలంటే కూడా యిష్టమే అయినా వ్యక్తిగా నచ్చడని చెబుతూ, ''ఒకసారి లార్డ్స్ మైదానంలో క్రికెట్ మ్యాచ్ చూసి తిరిగొస్తుంటే సోమర్సెట్ మామ్ ఎదురొచ్చాడు. నావంక చూశాడు, నేనూ అతని వంక చూశాను, మేమిద్దరం ఓ మై గాడ్ యిప్పుడు ఆగి మాట్లాడాలా ? అనుకుని అదృష్టంకొద్దీ ఆ పని చెయ్యకుండా మా దారిన మేము వెళ్ళిపోయాం'' అని చెప్పాడు. షేక్స్పియర్ రచనలన్నీ సంవత్సరానికి ఒక్కసారైనా చదివేవాడట.

**నైట్‌హుడ్ (Knight of the Order of the British Empire)**

బ్రిటిష్ ప్రభుత్వం ఆలస్యంగానైనా 1975 కొత్త సంవత్సరపు జాబితాలో వుడ్‌హౌస్‌కి నైట్‌హుడ్ ప్రకటించింది. బి.బి.సి. కి యిచ్చిన ఇంటర్వ్యూలో బ్రిటిష్ ప్రభుత్వం నైట్‌హుడ్ యిచ్చినందుకు, మేడమ్ తుసాడ్స్ మ్యూజియంలో తన మైనపు ప్రతిమ వుంచినందుకూ జీవితంలో మరింకేమీ ఆశించడం లేదన్నాడు. ఇంగ్లాండుకి రమ్మంటూ శ్రేయోభిలాషు లంతా కోరితే తనెప్పుడూ విమానంలో ప్రయాణించలేదు కనక అదో అవకాశంగా భావించాడాయన. ఆరోగ్యరీత్యా డాక్టర్లు ప్రయాణం వద్దంటే వుడ్‌హౌస్ అభిమాని అయిన క్వీన్ మదర్ వాషింగ్టన్‌కొచ్చి పురస్కారం అందించాలని చూసినా కుదరలేదు. చివరకి న్యూయార్క్‌లోని బ్రిటిష్ కాన్సులేట్‌లో యిచ్చేందుకు పూనుకుని అనువైన తేదీ నిర్ణయించే లోపల – ఎన్నో యువజంటల్ని తన కథల్లోనూ, నవలల్లోనూ ఏకం చేసిన ఆ మహారచయిత – ప్రేమికుల రోజు – ఫిబ్రవరి 14న హాస్పిటల్లో మృతి చెందాడు. ఆ తరవాత కొన్నిరోజులకి వుడ్‌హౌస్ భార్య ఎథెల్‌కు ఆ పురస్కారాన్ని యింటి దగ్గిర అందజేసి బ్రిటన్ తనని తాను గౌరవించుకుంది. ఓవెన్ డడ్లీ ఎడ్వర్డ్స్ అనే రచయిత వుడ్‌హౌస్ మరణించిన రోజున చర్చి మాస్‌లో ఆయన్ని జ్ఞప్తి చేసుకోమని మిత్రుడిని కోరితే, ''మీరు చెప్పినందుకు తప్పకుండా చేస్తాను, అయినా జీవితంలో యింతమందికి ఎంతో వినోదం, ఆనందం పంచినవాడికి నిజంగా అది అవసరమంటారా?'' అని ప్రశ్నించాడని రాశాడు.

**చివరి అసంపూర్తి రచన**

ఆయన అస్తమించిన హాస్పిటల్ గదిలో సరికొత్త నవల కోసం టైపు చేసిన 74 కాగితాలు, మరికొంత నోట్సు దొరికాయి. సరైన టైటిల్ తరవాత ఎంచుకునేందుకు పదహారు రకాల పేర్లు రాసిపెట్టుకున్నాడు. వుడ్‌హౌస్ సాహిత్యానికి, జీవిత విశేషాలకి ప్రామాణికుడు (అథారిటీ) అయిన రిచర్డ్ యుస్బార్న్ ఆ కాగితాలన్నిటినీ క్రమబద్ధం చేసి 'సన్‌సెట్ ఎట్ బ్లాండింగ్స్' అంటూ సమంజసమైన పేరు పెట్టిన ఆ అసంపూర్తి నవల 1977లో విడుదలయింది.

**తెలుగు రచయితలకి స్ఫూర్తి**

'ఓ పైవుందా?' అంటూ తెలుగువారికి సుపరిచితమైన ముళ్ళపూడి వెంకట రమణగారి అప్పుల అప్పారావు వుడ్‌హౌస్ సృష్టించిన ఉక్రిడ్జ్‌కి చాలా దగ్గర. రమణగారితో ఆ విషయం ముచ్చటించాలని ఎన్నోమార్లు అనిపించినా అడగలేదు.

ఈమధ్యనే బాపుగారిని అప్పుల అప్పారావుకి స్ఫూర్తి, ప్రేరణ ఉక్రిడ్జా? అని అడిగితే – చిన్నప్పుడు రమణగారికన్నా తనే ఎక్కువగా వుడ్‌హౌస్ పుస్తకాలు చదువుతుండేవాడినని చెబుతూ అయినా రమణగారికి వేరే స్ఫూర్తి, ప్రేరణలు అక్కర్లేదు అన్నారు. స్ఫూర్తి చెందిన కొంతమంది రచయితలు బయట పడలేదు. మారుపేర్లతో యింట్లోకి చొరబడి సందడి చేసిన పాతకాలపు సినిమా (నాగేశ్వరరావు, అంజలీదేవి, చలం, బి.సరోజ) రిపబ్లిక్ ప్రొడక్షన్స్ వారి పెళ్ళిసందడి; మారువేషాల్తో అలజడి చేసిన విజయావారి అప్పుచేసి పప్పుకూడు వుడ్‌హౌస్ వరవడిలోవి. పాలగుమ్మి పద్మరాజుగారు బ్రతికిన కాలేజీ పుస్తకానికి ముందుమాటగా 'నా సంజాయిషీ'లో, ''వుడ్‌హౌస్‌లాగా వ్రాయగలగడం అసంభవమని తెలుసు. అయితే వ్రాయాలన్న అభిలాష చాలాకాలంగా బాధ పెడుతోంది'' అంటూ చేసిన రచన నిజంగా ఆయన మాటల్లోనే 'వైఫల్య'మే కాక వుడ్‌హౌస్‌ని అనుకరించడం సాధ్యం కాదన్నదానికి దర్పణం. కాపీరైటు యిబ్బందులు పడకుండా వుడ్‌హౌస్ బాణీలో అంటూ వచ్చిన రచనలు అభిమానులు హర్షించరు సరికదా, ఆ మహారచయిత పట్ల మహాపచారం(బ్లాస్ఫెమీ)గా భావిస్తారు. వుడ్‌హౌస్ రచనల్ని అనువదించడం కష్టసాధ్యం; అనుక రించడం అసాధ్యం!

హైదరాబాదు వాసి, విశ్రాంత ఛీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ హెచ్. రాజేంద్రప్రసాద్‌గారి థీసిస్ ఆధారంగా – 'లాఫింగ్ విత్ ది మాస్టర్: ఇన్ ప్రెయిజ్ ఆఫ్ పి.జి. వుడ్‌హౌస్' పేరున విదేశాల్లో పుస్తకంలో వెలువడింది. అంతే కాదు, వుడ్‌హౌస్ నుంచి వచ్చిన వుత్తరమొకటి పదిలంగా దాచుకున్నారాయన. బాపుగారు తన అమెరికా పర్యటనలో మిత్రులతో కలిసి లాంగ్ ఐలెండులో వుడ్‌హౌస్ నివసించిన రెమ్సెన్‌బర్గ్‌కి వెళ్ళి ఆ మహారచయిత సమాధి వద్ద నివాళులర్పించాలని వూరంతా తిరిగి, సరైన సమాచారం దొరక్క వెనుతిరిగి రావాల్సి వచ్చిందన్నారు. ఆ తరవాత వారి మిత్రులు పట్టువదలకుండా మరోసారి కుటుంబంతో వెళ్ళి ముప్పతిప్పల్తో మొత్తానికి ఆ సమాధి ఫలకం కనుక్కున్న వైనం తెలుపుతూ దాదాపు వుడ్‌హౌస్ శైలిలో రాసిన వుత్తరం మహారచయితకి నివాళి.

ఏ యితర రచయితకీ లేనంతగా వుడ్‌హౌస్ అభిమాన సంఘాలు ప్రపంచవ్యాప్తంగా వున్నాయి. మన దేశంలో కలకత్తా, ముంబాయి, బెంగళూరు, చెన్నైలో వున్నాయి. ఆయన మరణించి 38 సంవత్సరాలు దాటినా యిప్పటికీ ఆయన పుస్తకాలు బెస్ట్ సెల్లర్సే.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Lankebindelu](http://kinige.com/book/Lankebindelu)**

* * *